క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, మండలం పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను బుధవారం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో వారధి ఇండియా ఫౌండేషన్ వారి సౌజన్యంతో మండల విద్యాశాఖాధికారి ఎస్.విశ్వనాథం పర్యవేక్షణలో మండలస్థాయి పోటీలు జరిగాయి. వక్తృత్వ పోటీల్లో మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, వ్యాసరచన పోటీల్లో రత్తకన్న మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానాలను కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు బి.శ్రీనివాసులు, ప్రకాష్ ఉన్నారు.

సాంకేతిక శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

టెక్కలి: సాంకేతిక శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు సూచించారు. కళాశాలలో ఐగ్నిటీ హ్యాకథాన్‌పై వర్క్ షాప్‌ను బుధవారం ప్రారంభించారు. జెంట్రో బైట్ సొల్యూషన్స్ సంస్థ సహకారంతో రెండు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఐఐసీ డీన్ జి.సతీష్, ఐటీ హెడ్ బి.రమేష్‌నాయుడుతో పాటు టి.సాయిసతీశ్వర్‌రెడ్డి, పి.సుధీర్‌కుమార్, పి.ప్రశాంతి, సాయిమణికంఠ, చరణ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

టెక్కలి: పెన్షనర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కిమ్స్, శంకర్ ఫౌండేషన్ నేతృత్వంలో నిర్వహించిన శిబిరాన్ని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ప్రారంభించారు. అనంతరం సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పెన్షనర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.రామచంద్రరావు, కోశాధికారి బి.అయ్యబాబు పాల్గొన్నారు.

నైపుణ్యంతో ఉన్నత శిఖరాలు

ఇచ్ఛాపురం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేరీర్ అండ్ లైఫ్‌స్కిల్స్‌పై ఎవరైతే పట్టుసాధిస్తారో వారు ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని జేసీఐ జోన్ కేరీర్ అండ్ లైఫ్‌స్కిల్స్ ట్రైనర్ ఎం.సునీత అన్నారు. ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో స్థానిక స్వచ్ఛంద సంస్థ జేసీఐ ఆధ్వర్యంలో బుధవారం కేరీర్ అండ్ లైఫ్‌స్కిల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాయకుల పరామర్శ



గణపతి కుటుంబాన్ని పరామర్శిస్తున్న తిలక్ తదితరులు

టెక్కలి: టెక్కలి వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతాడ గణపతి తల్లి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ బుధవారం గణపతిని పరామర్శించారు. అలాగే పట్టణంలో బొడ్డేపల్లి శ్రీను అత్త మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, వాడవలస వసంతరావు మృతి చెందడంతో అతని కుటుంబాన్ని పరామర్శించారు. నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, నాయకులు కె.బాలకృష్ణారావు, సత్తారు సత్యం, తమ్మన్నగారి కిరణ్, జడ్యాడ జయరాం, ఎ.లక్ష్మీపతి ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



త్రినాథరావును సన్మానిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు లోలాక్షి తదితరులు

కంచిలి: కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న అగ్గున్న త్రినాథరావు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఇటీవల అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.చాణిక్య ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన్ని ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి క్రిష్ణారావు, విద్యా కమిటీ చైర్మన్ వాసు, టీడీపీ నాయకుడు జగదీష్ పట్నాయక్, పాల్గొన్నారు.

వచ్చేనెల 4, 5 తేదీల్లో సీఐటీయూ జిల్లా మహాసభలు

సోంపేట: సోంపేట పట్టణంలో అక్టోబర్ 4, 5 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా 12వ మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ, శ్రామిక జిల్లా మహిళా కన్వీనర్ కె.నాగమణి కార్మిక సంఘాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. జిల్లా మహాసభల ఆహ్వాన సంఘ సమావేశాన్ని స్థానిక కళాసీ సంఘం భవనంలో బుధవారం నిర్వహించారు. సభలకు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జుత్తు సింహాచలం, బి.హైమవతి, గోపినాథ్, డి.కృష్ణారావు, హేమలత, గణపతి పాల్గొన్నారు.

కొండలను తోడేస్తున్నారు!



కోసంగిపురం వద్ద కొండను తవ్వి తరలిస్తున్న కంకర

- యథేచ్ఛగా కంకరను అమ్ముకుంటున్నారు
- అక్రమార్కుల బరితెగింపు
- పలాస–కాశీబుగ్గ పట్టణానికి పొంచి ఉన్న విపత్తు!

పలాస: పలాస–కాశీబుగ్గ పట్టణానికి నలువైపులా ప్రకృతి ప్రసాదించిన పచ్చని కొండలను అక్రమార్కులు తోడేస్తున్నారు. దీంతో విపత్తు పొంచిఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా కొండలపై కురిసే వర్షం నీరు కిందకు జారి వాగులు, వంకల నుంచి పలాసలోని చెరువులను నింపడం ద్వారా గతంలో మంచినీటికి ఇబ్బంది ఉండేది కాదు. అంతే కాకుండా గాలి కూడా బాగా వీచేది. నిజం దేవుడెరుగు, నీరు పల్లమెరుగు సామెత లాగ కొండల నుంచి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన నీరు ఇప్పుడు కొండల పరిసరాల నుంచి రావడం లేదు. దీంతో నీటి సమస్యతో పాటు ప్రకృతి విధ్వంసం అవుతోందని ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీప భవిష్యత్తులో కాశీబుగ్గ–పలాస పట్టణాలకు విపత్తు రావచ్చేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొండలను పిండి చేయడమే కాకుండా వాటిని చదును చేసి ఇళ్ల స్థలాలుగా కూడా అమ్ముకొని కొంత మంది అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలాస–కాశీబుగ్గ పట్టణాలకు ఆనించి ఉన్న నెమలి కొండ, సూది కొండలు కనుమరుగవుతున్నాయి. ఇప్పుడు తాజాగా కోసంగిపురం జగనన్న కాలనీ వద్ద గల కొండను అక్రమార్కులు తవ్వికొని కంకరను విక్రయిస్తున్నారు. అధికా పార్టీ అండదండలతో అక్రమార్కులు బరితెగిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. జగనన్న కాలనీ చుట్టూ దట్టమైన రిజర్వు ఫారెస్టుతో పాటు కొండ కూడా ఉంది. ఈ కొండను కొన్ని రోజులుగా తవ్వుకొని వాటి కంకరను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. భవిష్యత్తులో చదును చేసిన స్థలాలను అమ్ముకునే అవకాశాలు లేకపోలేదని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒక ట్రాక్టర్ కంకరను సుమారు రూ.800 చొప్పున అమ్ముతున్నారు. ఇలా రోజుకు కనీసం 100 ట్రాక్టర్ల లోడు కంకరను ఆ కొండ నుంచి తవ్వి తీసుకెళ్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా తవ్వకాలు జరుగుతున్నా కనీసం అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీటిని అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని పలాస తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి వద్ద ప్రస్తావించగా.. తమ సిబ్బందిని పంపించామని తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



ట్రాక్టర్‌తో కంకరను తీసుకెళుతున్న దృశ్యం

ప్రకృతిని కాపాడుకోవాలి



ప్రకృతి ప్రసాదించిన సహజ సంపదను ప్రజలు కాపాడుకోవాలి. ముఖ్యంగా కొండలను యథాతదంగా ఉంచాలి. లేకపోతే చాలా ప్రమాదాలు సంభవిస్తాయి. రుతుక్రమాలు తప్పిపోతాయి. పెద్ద పెద్ద వర్షాలు వచ్చినప్పుడు వరదలు సంభవించి పరిసర గ్రామాలు కొట్టుకుపోతాయి. భూకంపాలు రావడానికి ఆస్కారం ఉంటుంది. జలవనరులు తగ్గిపోయి మంచినీటి ఇబ్బందులు తలెత్తుతాయి. – బోనెల గోపాల్, ప్రకృతి ప్రేమికుడు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు, పలాస

అధికారులు అడ్డుకోవాలి



పట్టపగలే కొండలను తవ్వుకు పోతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా సూదికొండను బోడి గుండు చేశారు. దీని వల్ల సూది కొండ కాలనీకి చాలా సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పుడు జగనన్న కాలనీ పక్క కొండను దొలిచేస్తున్నారు. అధికారులు అడ్డుకోవాలి. అక్రమార్కులపై తగిన చర్యలు తీసుకోవాలి

– శిష్టు గోపి, సూదికొండకాలనీ, పలాస

సేవా కేంద్రాల పరిశీలన



అర్హత కలిగిన ప్రతీ కార్మికుడు ఈ–శ్రమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తహసీల్దార్ బి.సత్యం, కార్మిక శాఖాధికారి రాధాకుమారి సూచించారు. టెక్కలి పట్టణంలోని పలు ఆన్‌లైన్ సేవా కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. కార్మికులు ఈ–శ్రమ్ రిజిస్ట్రేషన్ చేసుకుని తద్వారా ప్రయోజనాలు పొందాలన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. సీఎస్‌సీ సెంటర్ ప్రతినిధి ఎ.రాజేష్ ఉన్నారు. – టెక్కలి

విద్యార్థినికి ఆర్థిక సాయం



నందిగాం మండలం వి.టి.అగ్రహారం గ్రామానికి చెందిన దూపాన వాణి కాశీబుగ్గలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చదువుతోంది. ఈమెకు కొద్దిరోజులుగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. ఈ విషయం తెలుసుకున్న పెద్దబాణాపురం గ్రామానికి చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు రూ. 20 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని వాణి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేసి వైద్యం కోసం వినియోగించాలని సూచించారు. సంఘసభ్యులు జి.అనిల్, ఎం.తిరుపతిరావు, బి.పవన్, జి.సురేష్, కె.చంటి, కె.క్రిష్ణ, జి.రవి, బి.చైతన్య, ఆర్.శ్రీను, బి.ప్రమోద్, జి.సిద్దు ఉన్నారు. – నందిగాం

రణభేరి పోస్టర్ ఆవిష్కరణ



ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేస్తున్న యూటీఎఫ్‌కు సహకరించాలని సంఘ జిల్లా కార్యదర్శి ఎం.మురళీప్రకాష్ కోరారు. కవిటి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సంఘ ప్రతినిధులు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇద్దివానిపాలెం ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి యూటీఎఫ్ త్వరలో నిర్వహించతలపెట్టిన రణభేరి కార్యక్రమం గోడపత్రికను ఆవిష్కరించారు. – కవిటి

యూరియా కొరతపై సభ్యులు గరం.. గరం

- కంచిలి మండల సమావేశం



యూరియా కొరతపై నిలదీస్తున్న సభ్యులు



మండల వ్యవసాయాధికారి కె.సురేష్‌ను ప్రశ్నిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: యూరియా కొరత తీవ్రంగా ఉండటం, అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కంచిలి మండల పరిషత్ సాధారణ సమావేశం ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతు.. సరఫరా చేసిన యూరియాను కూడా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే వారికి ఇష్టం వచ్చిన వారికి ఇచ్చుకొంటున్నారని ఆరోపించారు. రైతుల అవసరాన్ని గుర్తించకుండా రాజకీయం చేయడం సరికాదన్నారు. మండలంలో పలు రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేసిన యూరియాను అక్కడి ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా వేరేవాళ్లను దగ్గరపెట్టి పంపిణీ చేయడం వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై ఇకముందు సక్రమంగా యూరియా సరఫరా చేయకపోతే తీవ్రంగా ప్రతిఘటిస్తామని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి సభాముఖంగా స్పష్టం చేశారు. యూరియా కొరతపై బొగాబెణి, పెద్దశ్రీరాంపురం, శాసనాం సర్పంచ్‌లు గణప సింహాచలం, బల్లెడ సుమన్, గుడ్డిపద్ర వేణు, జాడుపూడి ఎంపీటీసీ సభ్యురాలు జామి జయ, ముండల ఎంపీటీసీ సభ్యుడు భగవాన్ ప్రధాన్‌లు అధికారులను నిలదీశారు. సమావేశమంతా యూరియా కొరతమీదే చర్చ సాగింది. ఈ సందర్భంగా మండల రైతాంగం తరఫున కావాల్సిన యూరియా సరఫరా చేయాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ కూర్మారావుకు సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు. సమావేశంలో ఎంపీడీవో వి.తిరుమలరావు, డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రస్వామి పాల్గొన్నారు.

ఉల్లాసంగా క్రీడా పోటీలు



టెక్కలి: ప్రారంభ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు



పలాస: కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్కూల్ గేమ్స్ పోటీలు బుధవారం ఉల్లాసంగా జరిగాయి. అండర్–14, 17 విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలను మండల విద్యా శాఖాధికారులు బి.తులసీరెడ్డి, డి.చిన్నారావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ప్రారంభించారు. మండలంలోని 22 పాఠశాలల నుంచి 350 మంది క్రీడాకారులు హాజరయ్యారు. క్రీడల ఇన్‌చార్జి బి.నారాయణరావుతో పాటు ఎస్.లక్ష్మణరావు, కె.కె.రామిరెడ్డి, సీహెచ్.జగ్గమ్మ, ఆదిశేషు, డి.సూర్యకాంతం, కె.రఘునాథరావు, వై.వెంకటరమణ, ఆర్.డిల్లేశ్వరి పోటీలను పర్యవేక్షించారు.

పలాస: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. అండర్ 14, అండర్ 17 విభాగంలో విద్యార్థులకు కబడ్డీ, యోగాలోఎంపిక పోటీలు జరిగాయి. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు డివిజన్ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. కబడ్డీ, యోగా పోటీలకు 30 మంది చొప్పున ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లా సంతోష్ కుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.తాతయ్య, ప్రధానోపాధ్యాయులు పి.రవికుమార్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.తవిటయ్య, పి.కృష్ణారావు, వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్ పద్మలోచనం, బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు, ఎస్.వి.జోగారావు, సి.హెచ్ రామ్‌జీ, టి.గీత, సునీత, గణేష్, రవి కాంత్ పాల్గొన్నారు.

రణభేరిని విజయవంతం చేయండి

సోంపేట: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు కోరారు. సోంపేటలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను వేయాలని, ఐఆర్ ప్రకటించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు కూర్మారావు, దొరబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

త్వరలో టిడ్కో ఇళ్లు పంపిణీ

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో పీఎంఏవై (అర్బన్ హౌసింగ్) ఏపీ టిడ్కో ద్వారా 912 ఇళ్లు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తయ్యాయని.. వాటిని లబ్ధిదారులకు త్వరలో అందజేస్తామని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 912 ఇళ్లకుగాను ఇప్పటికి 706 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయించామన్నారు. మిగతా వారు కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. 206 మందికి మెప్మా ద్వారా బ్యాంక్ రుణాల కోసం ప్రక్రియ ప్రారంభమయిందని రామారావు చెప్పారు.

నేడు డయల్ యువర్ డీఎం

టెక్కలి: టెక్కలి ఆర్టీసీ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రయాణికులు వారి సమస్యలను 99592 25611 నంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

ఏబీ రోడ్డుపై ప్రయాణం నరకం!



అంపురం-ఘాటీముకుందాపురం రోడ్డు దుస్థితి

- మరమ్మతులు చేపట్టిన కొద్దిరోజులకే శిథిలమైన వైనం
- వాహనదారుల తీవ్ర అవస్థలు



కర్తలి గ్రామం వద్ద గోతులమయమైన రోడ్డులో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు



అంపురం నుంచి కర్తలి మార్గంలో గోతులమయమైన రోడ్డులో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు

కంచిలి: ఆంధ్రా–ఒడిశా గ్రామాలను కలిపే అత్యంత ప్రాధాన్యత గల రహదారి దారుణంగా తయారైంది. కంచిలి మండల పరిధిలోని జాతీయ రహదారి అంపురం గ్రామ కూడలి నుంచి ఘాటీముకుందాపురం గ్రామం వరకు సుమారు 12 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోని రోడ్డు మార్గం దయనీయ స్థితికి చేరింది. కొద్ది నెలల క్రితమే కొంత భాగంలో ప్యాచ్ వర్క్ చేసినప్పటికీ మళ్లీ యథాస్థితికి చేరింది. చేరింది. ఈ రోడ్డు మార్గంపై కంచిలి మండల పరిధిలోని పలు గ్రామాలతోపాటు సరిహద్దు ఒడిశా గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు చేస్తుంటారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అత్యంత దారుణంగా తయారైన ఈ మార్గంలో ఆర్అండ్‌బీ మరమ్మతుల నిధులు రూ. 32 లక్షలతో రెండు భాగాల్లో మరమ్మతులు చేపట్టారు. కర్తలి గ్రామం నుంచి అంపురం జంక్షన్ వరకు చేపట్టిన మరమ్మతులు పూర్తిగా తీసికట్టుగా ఉండటంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మఠం సరియాపల్లి నుంచి ఘాటీముకుందాపురం వరకు ప్యాచ్ వర్క్‌లు చేసినప్పటికీ కొద్దిరోజుల్లోనే మళ్లీ పాడైంది. వర్షాకాలం కావడంతో గోతుల్లో నీరు నిలిచిపోతుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురౌతున్నారు. ఈ మార్గంలో మండలంలోని 12 పంచాయతీల ప్రజలు అవసరాలు తీర్చుకుంటుండగా, పదులో సంఖ్యలో ఒడిశా గ్రామాల ప్రజలకు కూడా ఆదే రోడ్డు ఆధారం. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డుకు ఆర్అండ్‌బీ శాఖ అధికారులు పట్టించుకోకవడం లేదని ఈ ప్రాంతీయులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చేయాలి



అంపురం నుంచి ఘాటీముకుందాపురం రోడ్డు మార్గంలో కంచిలి మండల పరిధిలో ఉన్న 12 పంచాయతీల ప్రజలతోపాటు సమీప ఒడిశా రాష్ట్రానికి చెందిన అధికసంఖ్యలో గ్రామాల ప్రజలు ప్రయాణ అవసరాలు తీర్చుకొంటున్నారు. దీన్ని డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతీయులకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలి. – కె.సురేష్, సర్పంచ్, మఠం సరియాపల్లి, కంచిలి మండలం

గోతులతో ప్రమాదం



ఏబీ రోడ్డుకు అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కొంతమేరకు మరమ్మతులు చేపట్టినప్పటికీ మళ్లీ గోతులు ఏర్పడ్డాయి. వర్షాకాలం కావడంతో గోతుల్లో నీరు చేరి వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు.

– బర్రి బాబూరావు, రేఖాదేవిపురం, కంచిలి మండలం

మహిళా, శిశు సంక్షేమ పథకాలపై అవగాహన

టెక్కలి: మహిళా, శిశు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి ఐసీడీఎస్ పీవో విద్య కోరారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళా, శిశు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.

ఎరువులపై అధికారుల ఆరా

ఇచ్ఛాపురం రూరల్: రైతులకు ఎరువులు అందించేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న డ్వామా ఏపీడీ చల్లా శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం తహసీల్దార్ ఎస్.వెంకటరావు, ఎంపీడీఏ కె.రామారావు, డిప్యూటీ ఎంపీడీవో వెంకటరావుతో కలసి లొద్దపుట్టి, మండపల్లి, బిర్లంగి గ్రామాల్లోని రైతులతో సమావేశమయ్యారు.

ఏపీఎంగా కూర్మారావు

ఇచ్ఛాపురం రూరల్: కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్న సెర్ప్ ఏపీఎం పోస్టు ఎట్టకేలకు భర్తీ అయింది. మందస మండల ఏపీఎంగా పనిచేస్తున్న పైడి కూర్మారావును మండలానికి నియమించగా..ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండల మహిళా సమైఖ్య అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రతీ మహిళా ఆర్థికాభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. వీవోఏలు, స్వయం శక్తి సంఘ అధ్యక్షులు పుష్ప గుచ్ఛాలతో ఏపీఎంను అభినందించారు.